శీతాకాలం... చన్నీటి స్నానం


అరడకుకోట ఆశ్రమ పాఠశాలల్లో మంచులో ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు

- ఆశ్రమాల్లో పనిచేయని సోలార్ హీటర్లు
- ఒక్కోచోట రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలతో ఏర్పాటు
- చేతి పంపులు, ట్యాంకుల వద్ద విద్యార్థుల అవస్థలు
- గడ్డకట్టే చలితో అనారోగ్యం
- పట్టించుకోని అధికారులు

అసలే శీతాకాలం...అందులోనూ ఏజెన్సీ ప్రాంతం... నవంబరు నుంచి జనవరి వరకు ఎముకలు కొరికేంత చలి ఉంటుంది. అప్పుడే చలివణికించేస్తోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. తెల్లవారు జామున పరిస్థితి చెప్పనవసరం లేదు. ఇటువంటి వాతావరణంలో మామూలు నీటితో స్నానం చేస్తేనే గజగజమంటూ వణికిపోయే పరిస్థితి. కానీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు నిత్యం చల్లటి నీటితోనే స్నానాలు చేయాల్సి వస్తోంది. వసతి గృహాల్లో గతంలో ఏర్పాటుచేసిన సోలార్ వాటర్ హీటర్ యూనిట్లు పనిచేయకపోవడమే ఇందుకు కారణం. మరమ్మతు పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. సౌర విద్యుత్తు యూనిట్లు ఏడాది క్రితం మూలనపడగా.. వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.


పెదబయలు ఆశ్రమ బాలుర పాఠశాల-1లో మూలకు చేరిన సోలార్ వాటర్ ప్లాంట్లు


పెదబయలు గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల -2లో పని చేయని సోలార్ వాటర్ ప్లాంట్


పెదయబయలు ఆశ్రమ పాఠశాలలో బోరు వద్ద స్నానం చేస్తున్న విద్యార్థులు

పెదబయలు : మండలంలోని 11 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 4,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు వేడినీటితో స్నానం చేసేందుకు వీలుగా ఒక్కో పాఠశాలలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల ఖర్చుతో విద్యార్థుల సంఖ్య ఆధారంగా రెండు వేల లీటర్ల నుంచి 5 వేల లీటర్ల సామర్థ్యం గల సోలార్‌వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించవలసి ఉంది. నిర్వహణ లోపం, అధికారుల అలసత్వం కారణంగా ఆరు పాఠశాలల్లో ఈ ప్లాంట్లు మరమ్మతులకు గురై ఏడాదిగా మూలకు చేరాయి. కొన్ని చోట్ల సోలార్ ప్లేట్‌లు పగిలిపోగా, మరికొన్ని చోట్ల వైరింగ్ సమస్య ఉంది. దీంతో పెదబయలు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల-1,2, సీకరి,అరడకోట, పెదబయలు, తురకలవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలల్లో మూడో తరగతి నుంచి 10 వతరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు తెల్లవారుజామునే వణికించే చలిలో చన్నీటి స్నానాలు చేయవలసి వస్తోంది. చాలామంది విద్యార్థులు చలికి భయపడి రెండు, మూడు రోజులకోసారి స్నానాలు చేస్తూ, చర్మ సంబంధ వ్యాధుల బారినపడుతున్నారు. కాలకృత్యాలు తీరుకోడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి ప్లాంట్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉపాధ్యాయులు,విద్యార్థులు కోరుతున్నారు.

చన్నీటితో స్నానం ఇబ్బందిగా ఉంది



శీతా కాలంలో చల్లటి నీటితో స్నానం చేయడం ఇబ్బందిగా ఉంది.గతంలో వేడి నీటితో స్నానం చేసేవారం.సోలార్ ప్లాంట్ పని చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

–వంతాల శివాజీ, 9వ తరగతి,గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల– 2, పెదబయలు

ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి



వేడినీరు అందించే సోలార్ ప్లాంట్ పని చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదు.ఉదయం చలి, మంచులో స్నానాలు చేయడం ఇబ్బందిగా ఉంది. ప్లాంటును వినియోగంలోకి తేవాలి

– కొర్రా సంజీవరావు, 9వ తరగతి, సంక్షేమ ఆశ్రమ పాఠశాల -1. పెదబయలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలోని ఆరు ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్లు మరమ్మతులకు గరవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

– కూడ వెంకటరమణ, ఏటీడబ్ల్యూవో పెదబయలు మండలం

క్లుప్తంగా

విద్యాకార్యక్రమాల విజయవంతానికి కృషి


గురుకుల పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాకార్యక్రమాల విజయవంతానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. అడ్డతీగల గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అపార్ రిజిస్ట్రేషన్, మెగా పేరెంట్స్ మీటింగ్, ఎస్ఎంసీ గూగుల్ ఫామ్ తదితర అంశాలపై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్‌బాబుతో చర్చించారు.ఎఫ్–1,ఎఫ్–2 మార్కుల ఎంట్రీలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన


పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం: ఈనెల 5న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు గంగవరం తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గిరిజనులతో మాత్రమే గ్రామ సభలు నిర్వహించాలి


రాజుబాబు

కొయ్యూరు: పంచాయతీ రాజ్ విస్తరణ చట్టం ప్రకారం గిరిజన ప్రాంతాల్లో గ్రామసభలను గిరిజనులతో మాత్రమే నిర్వహించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు అన్నారు. ఆయన మంగళవారం కొయ్యూరు విలేకరులతో మాట్లాడుతూ ఆ చట్టం గిరిజనులకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. గ్రామసభలను గిరిజనేతరులతో నిర్వహిస్తే కోర్టులో కేసు వేస్తామని తెలిపారు.

ఈక్రాప్ చేయించుకోవాలి


మినుము పంటను పరిశీలిస్తున్న ఏవో రాబిన్ సుదర్శన్

ఎటపాక: రైతులు సాగుచేసిన ప్రతిపంటకు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ తెలిపారు. మంగళవారం తోటపల్లిలో మినుము,పెసర,మొక్కజొన్న,పొగాకు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పురుగు మందుల పిచికారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బోర్లు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ శారద

దుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన రెండు బోర్లను మంగళవారం సర్పంచ్ జి.శారద ప్రారంభించారు. వాటికి మోటార్లు బిగించడంతో నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాగు నీటి సమస్య పరిష్కారానికి ఆచంటనగర్ వార్డు 1, 2 లలో బోర్లు తీయించినట్టు తెలిపారు.

రాజీకి వీలైన కేసులు పరిష్కరించుకోవాలి


లోక్ అదాలత్ నిర్వహణపై ఎస్ఐలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబు

అడ్డతీగల: రాజీకి వీలైన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని అడ్డతీగల జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి పి.బాబు సూచించారు. ఈనెల 14 న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంపై స్థానిక కోర్టు హాలులో అడ్డతీగల,దుశ్చర్తి,రాజవొమ్మంగి, వై.రామవరం,జెడ్డంగి స్టేషన్ల ఎస్ఐలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఆయా స్టేషన్ల పరిధిలో రాజీకి అవకాశం ఉన్న కేసులు పరిశీలించి, జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా చూడాలన్నారు.

కేంద్రప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

జి.మాడుగుల: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాభివృద్ధి పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కాఫీ బోర్డు సభ్యుడు, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమా మహేశ్వరరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహం ఆవరణలో మంగళవారం బీజేపీ మండల పార్టీ సమావేశం ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల పార్టీ ఇన్‌చార్జ్ సల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఘనంగా ఎంపీ తనూజరాణి జన్మదిన వేడుకలు


పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పాడేరు : అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజ రాణి జన్మదిన వేడుకలను మంగళవారం పాడేరులో ఘనంగా నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఢిల్లీలో ఉన్న అరకు ఎంపీ తనూజ రాణికి స్థానిక నాయకులు ఫోన్ ద్వారా శుభకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ,వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర,ఎంపీటీసీలు కె.నర్సింహమూర్తి,ఎల్.రామకృష్ణపాత్రుడు,డి.సన్యాసిరావు, మండల సర్పంచ్‌లఫోరంఅధ్యక్షుడు వనుగు బసవన్నదొర,సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, గొల్లోరి నీలకంఠం,ఎస్.లక్ష్మణరావు, వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డి.పి.రాంబాబు పాల్గొన్నారు.
హుకుంపేట: హుకుంపేటలో మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం,అడ్డుమండ సర్పంచ్ (ఎంపీ తండ్రి) గుమ్మా శ్యామ్‌సుందర్,నాయకులు ఒంటుబు స్యామ్యూల్, విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు పూర్ణిమ,సత్యవతి,బొంజుబాబు, సాంబ పాల్గొన్నారు.
అరకులోయటౌన్: స్థానిక పద్మాపురం జంక్షన్ వద్ద గల క్యాంప్ కార్యలయంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు.డుంబ్రిగుడ జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేష్,అరకులోయమండల పార్టీ కార్యదర్శి మొష్యా రంజిత్‌కుమార్, సర్పంచ్ గుమ్మా నాగేశ్వరరావు, ఎంపీటీసీ వరలక్ష్మి, కోఆపరేటివ్ చైర్మన్ హస్తినకుమార్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్, వైస్ ఎంపీపీ లలిత పాల్గొన్నారు.
ముంచంగిపుట్టు: అరకు ఎంపీ గుమ్మ తనూజ రాణి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా నిర్వహించారు.బర్త్‌డే కేక్ కట్ చేసి, స్థానిక సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు,పాలు,బిస్కెట్లు పంపిణీ చేశారు.పలుచోట్ల మొక్కలు నాటారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు పద్మారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు,సర్పంచులు రమేష్,గంగాధర్,నీలకంఠం,బాబురావు,నరసింగరావు పాల్గొన్నారు.
రంపచోడవరం: స్థానిక సర్పంచ్ బొజ్జయ్య ఇంటి వద్ద కేక్ కట్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వలీ, పార్టీ నాయకులు బొబ్బా శేఖర్, చితుకులయ్యరెడ్డి, డొక్కులూరి రత్నరాజు, కొండ్రాజు, అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో వెసులుబాటు కల్పించాలి


ముంచంగిపుట్టులో రోడ్డు విస్తరణపై సమావేశమైన స్థానికులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో రోడ్డు విస్తరణ జరిగితే పేదలు, వ్యాపారులకు అన్యాయం జరగకుండా కొంతమేర వెసులుబాటు కల్పించాలని పలువురు కోరారు. ముంచంగిపుట్టులో రోడ్డు విస్తరిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వ్యాపారులు, గృహ యజమానులు మంగళవారం అత్యవసరంగా సమావేశమయ్యారు. ఎవరికీ నష్టం జరగకుండా విస్తరణ జరపాలని కోరుతూ తీర్మానించారు.

అగ్నిప్రమాద బాధితులకు పరిహారం అందజేత

పాడేరు : జి.మాడుగుల మండలం కె.కోడాపల్లిలో గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు, ఇతర సామగ్రి కోల్పోయిన బాధితులకు కలెక్టర్ దినేష్‌కుమార్ నష్టపరిహారం మంజూరు చేశారు. మంగళవారం బాధితులు సామెలి సింహాచలం, సామెలి భాస్కర్‌రావుకు రూ.25వేల చొప్పున అందజేశారు. బాధితులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లే అధిక ప్రమాదాలు

డుంబ్రిగుడ: డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని అరకులోయ సీఐ హిమగిరి తెలిపారు. మండలంలోని అరకు సంతబయలులో మోటర్ యూనియన్ నాయకులు, లారీల యజమానులతో మంగళవారం మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తామని సీఐ తెలిపారు. అరకు మాజీ సర్పంచ్ వెంకటరాజు, లారీ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.


వాహన యజమానులతో మాట్లాడుతూన్న సీఐ హిమగిరి

ఆక్రమణల తొలగింపునకు చర్యలు ముమ్మరం

- తహసీల్దార్ అల్లు సత్యనారాయణ


జాతీయ రహదారికి ఇరువైపుల గల కట్టడాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

రాజవొమ్మంగి: మండలంలో జాతీయ రహదారికి ఇరువైపుల గల ఆక్రమణల తొలగించేందుకు ముమ్మరంగా చర్యలు తీసుకొంటున్నామని రాజవొమ్మంగి తహసీల్దార్ అల్లు సత్యనారాయణ తెలిపారు. సర్వేయర్లు, వీఆర్వోలతో మంగళవారం సమావేశమై చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణలు వెంటనే తొలగించాలంటూ కలెక్టర్ నుంచి ఆదేశాలు అందాయన్నారు. రోడ్లు,భవనాల శాఖ రికార్డుల ప్రకారం ఆర్‌అండ్‌బీ రోడ్డు, జాతీయ రహదారి, స్టేట్ హైవేకు ఇరువైపుల గల ఆక్రమణలు, వివిధ కట్టడాలకు నోటీసులు జారీ చేస్తున్నట్టు చెప్పారు. సాగునీటి చెరువులు, పంటకాలువలు, రెవెన్యూ కాలువలు, సెలఏరుల ఆక్రమణలు, వాటిపై కట్టడాలను కూడా త్వరలో తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం కొలతలు తీస్తున్నామన్నారు. ఆయనతో పాటు మైనర్ ఇరిగేషన్ ఏఈ హరి, వీఆర్వో మురళి సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు

అడ్డతీగల: ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాలని అడ్డతీగల తహసీల్దార్ కొమరం సూర్యారావు రైతులకు సూచించారు.అడ్డతీగల సొసైటీ కార్యాలయం వద్ద మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన ధరకు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసాలకు గురికావొద్దన్నారు.ధాన్యం విక్రయిస్తే 48 గంటల్లో సంబంధిత రైతు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కి రూ.2,300,.. 75 కిలోలు అయితే రూ.1,725 మద్దతు ధర ఉందని వ్యవసాయాధికారి ఎం.సువర్ణ కుమారి తెలిపారు.గ్రేడ్ ఏ రకం అయితే క్వింటాల్‌కి రూ.2,320 ధర నిర్ణయించగా 75 కిలోలు బస్తా ధాన్యం రూ.1,740 ఉందన్నారు.చెడిపోయిన లేదా మొలకెత్తిన,పురుగు తిన్న ధాన్యం గింజలు 4 శాతానికి మించరాదన్నారు.రైతులు కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవచ్చన్నారు.రైతు సేవా కేంద్రాలు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు.ఎంపీడీవో చిన్నిబాబు,సొసైటీ సీఈవో మణిరాజు,రైతులు పాల్గొన్నారు.

అంగవైకల్యం ఉందని.. అధైర్యం వద్దు


దివ్యాంగ బాలుడికి బహుమతి, నగదు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


చిన్నారికి వీల్‌చైర్ అందజేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఏఎంవోఐఈ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రావు


హుకుంపేట భవిత కేంద్రంలో ఎంఈవోలు చెల్లయ్య,ఈశ్వరరావు, ఉపాధ్యాయులు

జి.మాడుగుల: దివ్యాంగ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంగవైకలం ఉందని అధైర్యపడవద్దని, అంగవైకల్యం కల అనే మంది అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. గతనెల 27న నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన 15 మందికి బహుమతులు, ఒక్కొక్కరికీ 1,000 చొప్పున నగదు ఆయన అందజేశారు. ఎంఈవో బాబూరావుపడాల్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజరతన్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, హనుమంతరావు, గంగరాజు, బాలమ్మ,సత్యనారాయణ, ఐఈఆర్టీలు రాజు,సరోజినీ తదితరులు పాల్గొన్నారు.
మారేడుమిల్లి : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం వీణా దేవి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బొరగ త్రిత్వదాసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృఢసంకల్పం ఉంటే వైకల్యాన్ని జయించవచ్చని చెప్పారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. భవిత సెంటర్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని సదుపాయాలు అందిస్తున్నారని, చదువుల్లో కూడా మంచి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. అనంతరం చిన్నారులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఆటల పోటీలు నిర్వహించారు. ఒక విద్యార్థినికి వీల్‌చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నీలయ్య, ఉపాధ్యాయుడు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.
దుంబ్రిగుడ: స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎంవోఐఈ జిల్లా కోఆర్డినేటర్ కె.భాస్కరరావు దివ్యాంగ విద్యార్థినీవిద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో సుందరరావు తదితరులు పాల్గొన్నారు.
హుకుంపేట: దివ్యాంగులపై చిన్న చూపు చూడకుండా అందరూ బాధ్యతగా మెలగాలని ఎంఈవోలు సోమేలి చెల్లయ్య,ఈశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో గల భవిత కేంద్రం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ సునీత, భవిత కేంద్రం సిబ్బంది అమ్మాజీ,గౌరి ,ప్రదానోపాధాయులు సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి


ఎంఈవో సుందర్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న తూటంగి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ ఆ పాఠశాల విద్య కమిటీ చైర్మన్ వంజె రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంఈవోకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ పాఠశాలలో 115 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఏడుగురికి గాను కేవలం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఇక్కడ ఉన్నారని వారు తెలిపారు. ఈ విషయపై ఎంఈవో శెట్టి.సుందర్‌రావు సానుకూలంగా స్పందించి, త్వరలో ఉపాధ్యాయుడిని నియమించేందుకు హామీ ఇచ్చినట్టు రమేష్‌తో పాటు బీజేపీ యువ మోర్చ నాయకులు వై.ఎస్. బోసు, గోమంగి కృష్ణారావు, ద్రోణంరాజు తెలిపారు.

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి


టొంగికోటలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సీతమ్మ


రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి మధుసూదనరావు

ముంచంగిపుట్టు: పశువుల సంరక్షణలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ అరిసెల సీతమ్మ తెలిపారు. మండలంలోని వనభసింగి పంచాయతీ టొంగికోట,జర్జుల పంచాయతీ బొదిలి గూడ గ్రామాల్లో పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ పశు సంవర్ధకశాఖ అధికారుల సూచనలు,సలహాలు తప్పకుండా పాటించాలని తెలిపారు. సర్పంచ్ లక్ష్మణ్, పశు సంవర్ధక,వ్యవసాయశాఖల సిబ్బంది సూర్యప్రకాశ్,వరహాలమ్మ,వెంకటరాజు,చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ విధానాలు పాటించాలి

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు సాగులో శాస్త్రీయ విధానాలను పాటించాలని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. మండలంలోని పాతవీధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు.